# సింగిల్ పేజీ కథలు

## దానం

శివయ్య వుద్యోగం నుంచి రిటైరయ్యాక కూకట్‌పల్లి ఏరియాలో వున్న ప్రశాంత్‌నగర్ కాలనీలో ఇల్లు కొనుక్కుని స్థిరపడ్డాడు. రిటైరైపోయాక ఏమీ తోచడం లేదు.

ప్రశాంత్ నగర్ కొత్తకాలనీ కావడంతో పత్రికలు అమ్మే షాపు ఎవరూ తెరవలేదు. అప్పుడప్పుడూ టీవీ మీద విసుగొచ్చిన సందర్భాల్లో కూకట్‌పల్లి వరకూ వెళ్ళి ఒకటీ అరా పత్రికలు కొనుక్కు తెచ్చుకునేవాడు. అలా వెళ్ళడం కూడా బాగాలేక పేపర్ వేసే బాయ్‌తో వీక్లీలు మంత్లీలు పేపర్‌తోపాటు వెయ్యమన్నాడు. ఉద్యోగంలో వున్నప్పుడు తలాకాస్తా వేసుకుని సర్క్యులేషన్ లైబ్రరీ మెయింటైన్ చేసేవారు.

ఫస్ట్ వీక్‌లో పేపర్‌బాయ్ ఇచ్చిన బిల్లు చూసి శివయ్య భార్య- "ఏంటయ్యా! పేపర్‌కి వంద, పత్రికలకి రెండొందలా తగలేసేది?" అని మండిపడింది.

"వచ్చే పెన్షన్ డబ్బులతో ఇల్లు గడవక చస్తుంటే ఇక అనవసరపు ఖర్చులు పెట్టుకుంటే తిన్నట్లే" అని సణిగింది.

పత్రికలు ఇరుగు పొరుగు వారు అడిగి పట్టుకెళ్ళి, అప్పనంగా చదువుకోవడం కూడా ఆవిడ మంటకి మరో కారణం. దీంతో గొడవెందుకని పత్రికలు కొనడం మానేశాడు.కాలనీలో సాయిబాబా గుడి వెలిసింది. భక్తుల రాకపోకలు పెరిగాయి. రోడ్ల పక్కన బడ్డీకొట్లు వెలిశాయి.

శివయ్య ఇంటికి దగ్గర్లోనే ఒక కిళ్ళీ కొట్టు తెరిచారు. అది మినీ సూపర్ మార్కెట్టులా సమస్తం దొరికే దుకాణమని పక్కింటి అవధాని చెప్పాడు. కొన్ని రోజుల తర్వాత డైలీపేపర్లు, వీక్లీలు వగైరా వేలాడదీశాడు. అవధాని రోజూ పత్రికలు చదువుతున్నాడు. ఈయనకి పత్రికలు కొని చదివే తెగింపు ఎప్పుడొచ్చిందా అని శివయ్య ఆశ్చర్యపోయాడు. అదే విషయం అడిగాడు.

అవధాని నవ్వి "కిళ్ళీ కొట్టువాడు పత్రికలు అద్దెకు ఇస్తాడు. పత్రిక తీసుకెళ్ళి నలగకుండా పట్టుకెళ్తే రూపాయి తీసుకుంటాడు. ఒక్కరోజులో ఇచ్చెయ్యాలి" అన్నాడు.శివయ్యకి కిళ్ళీ కొట్టువాడిని పరిచయం చేసుకున్నాడు, అతని పేరు కృష్ణ. ఇంటి అరుగుమీద కూర్చుంటే కృష్ణ కిళ్ళీ కొట్టు కనిపిస్తూ వుంటుంది. కొత్త వీక్లీలు కనిపిస్తూ వుంటాయి. అవి చూసి వెళ్ళి తెచ్చుకుని వేడివేడిగా చదివేస్తున్నాడు శివయ్య. ఇప్పుడు కాస్త కాలక్షేపంగా వుంది.

ఒకరోజు శివయ్య వెళ్ళేసరికి కృష్ణ కిళ్ళీ కొట్టుముందు ముష్టివాడు నిలబడి వున్నాడు. బాగా ముసలివాడు. నల్లగా వంగిపోయివున్నాడు. వంటిమీద పాత ఖాళీ బస్తాని చించి కప్పుకున్నాడు. కృష్ణ ముష్టివాడి బొచ్చెలో పది రూపాయల కాగితం వేశాడు.



శివయ్య అదిరిపడ్డాడు.

ముష్టోడికి పది రూపాయలు దానం చేసిన కృష్ణని ఎగాదిగా చూశాడు. అతను తన పనిలో మునిగిపోయాడు. అబ్బ ఎంత గొప్పవాడితను. పైన పైన కూడబెట్టినదంతా ఇలా దానధర్మాలు చేస్తాడు కాబోలు అనుకున్నాడు. అతని మీద గౌరవం పెరిగిపోయింది శివయ్యకి.

మర్నాడు అరుగుమీద కూర్చుని యధాలాపంగా చూశాడు. మళ్ళీ నిన్నటి దృశ్యమే కన్పించింది. గోనె పట్టా కప్పుకున్న ముష్టోడికి పది రూపాయల కాగితం బొచ్చెలో వేస్తూ కనిపించాడు కృష్ణ. మతిపోయింది శివయ్యకి. అతని కేరెక్టర్ ఏంటో అర్థం కావడం లేదు.

రాత్రింబవళ్ళు కిళ్ళీకొట్లో కూర్చుని పైన పైన కూడబెట్టి ఇలా దానం చెయ్యడం ఏమిటి? అదీ అర్ధ, రూపాయి కాదు ఏకంగా పది రూపాయల నోటు. ఎంత ఆలోచించినా అతని కేరెక్టర్ అర్థం కావడం లేదు.

ఏదో పత్రికలో చదివాడు. బొంబాయిలో నానాపటేకర్ అని సినిమా ఆర్టిస్ట్ సినిమాకి కోటి రూపాయలు తీసుకుంటాడట. అందులో తొంభై లక్షలు దానధర్మాలకు ఇచ్చేస్తాడట. వీడిదీ అటువంటి కేరక్టరేనేమో? అనుకున్నాడు శివయ్య.కుతూహలం కొద్దీ కృష్ణనే గమనించడం మొదలుపెట్టాడు. గోనెపట్టా ముష్టోడికి రోజూ పది రూపాయల కాగితం ఇవ్వడం మానలేదు. ఆ ముష్టోడికి అంత డబ్బు ఎందుకు దానం చేస్తావయ్యా! నీకేమైనా చాదస్తమా? పిచ్చా అని అడగాలనిపిస్తుంది. కాని తనకు అతన్ని నిలదీసేంత చనువు లేదు. అదీగాక అడిగితే ఏమంటాడో? 'నా డబ్బు, నా ఇష్టం, మధ్యలో నీకేం దురద' అని కేకలేస్తే? అని సందేహించాడు.

ఒకరోజు శివయ్య వీక్లీ కోసం కిళ్ళీ కొట్టు దగ్గర వున్నప్పుడే ఒక ముసలి ముష్టిది వచ్చి "అయ్యా! దానం" అన్నది.

కృష్ణముఖం చిట్లించుకుని "పో..పోవమ్మా! పొద్దున్నే" అని విదిలించి కొట్టాడు.

పాపం ముసల్ది నిరాశగా వెళ్ళిపోయింది.

"ఏవయ్యా! ఆ గోనెనంచీ ముష్టోడికి రోజూ పది రూపాయలు దానం చేస్తున్నావు? ఒక్కడికే పది రూపాయలు దానం చేసే బదులు పదిమందికి పది రూపాయలు దానం చెయ్యొచ్చుగా?" అడిగాడు శివయ్య.

కిళ్ళీ కొట్టు కృష్ణ పక పక నవ్వాడు.

"నేను దానం చెయ్యడం ఏంటి సార్! నా మొఖానికి దాన ధర్మాలు కూడాను" అన్నాడు.

శివయ్య బిత్తరపోయి "మరి?" అన్నాడు.

"ఆ గోనె పట్టా ముష్టోడు నా ఫైనాన్సర్. వాడి దగ్గర పదివేలు అప్పు తీసుకున్నాను. నేను రోజూ ఇచ్చే పది రూపాయలు వడ్డీ" అన్నాడు ముసి ముసి నవ్వులు నవ్వుతూ.శివయ్యకి మతిపోయింది.

"సార్! మీకెప్పుడైనా డబ్బు అవసరమైతే చెప్పండి. ఇప్పిస్తాను" అన్నాడు కృష్ణ.

శివయ్య బిత్తర చూపులు చూసుకుంటూ ఇంటికి బయల్దేరాడు.

-వాణిశ్రీ